
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.2 : కనిష్ఠం 18.7
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 27 డిసెంబరు 2024


• మంకినిలో ఇసుక డంప్ ఇలా..


• పోతంగల్ మండలం కొడిచర్లలో ఇసుక డంప్ చేసిన దృశ్యం

జోరుగా ఇసుక దందా!

- జిల్లాలో మంజీరా నుంచి భారీగా ఇసుక అక్రమ రవాణా
- రాత్రివేళల్లో తవ్వకాలు చేస్తూ వాహనాల ద్వారా తరలింపు
- జిల్లాలోని పెద్దవాగు, కప్పల వాగు, పూలాంగ్ వాగుల్లోనూ కొనసాగుతున్న తవ్వకాలు
- అక్రమ రవాణాను అరికట్టకుండా నేతల ద్వారా ఒత్తిళ్లు పెంచుతున్న తవ్వకందారులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

నిజామాబాద్, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇసుక టెండర్లు లేవు. క్వారీలకు అనుమతులు లేదు. ఇసుక రీచ్‌లు ఉన్నా.. ప్రభుత్వ పథ కాలు, అవస రాలకు మినహా అధికారుల నుంచి అను మతులు లేవు. అయినా జిల్లా వ్యాప్తంగా నదులు, వాగుల్లో అక్రమంగా తవ్వకాలను కొనసాగిస్తున్నారు. మంజీరా, ఇతర వాగు ల నుంచి పెద్ద ఎత్తున టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. అడ్డు వచ్చి న మండల స్థాయి అధికారులను బెది రింపులకు గురిచేయడంతో పాటు భారీ ఎత్తున ఇసుకను తరలిస్తున్నారు. మండల కేంద్రాలు, జిల్లా కేంద్రంలో డంప్‌లలో ఇసుక నిలువ ఉంచడంతో పాటు అవస రమైన వారికి సరఫరా చేస్తున్నారు. భారీ మొత్తంలో డబ్బులను వసూలు చేస్తున్నా రు. ఇళ్ల నిర్మాణంతో పాటు వెంచర్లకు పెద్ద ఎత్తున అవసరం కావడంతో టన్నుల లెక్కన అమ్మకాలను కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికార పార్టీ పెద్దల మద్దతు ఉండటంతో అధికారులు కూడా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్నిసార్లు తప్పనిసరి పరిస్థితుల్లో కేసు బుక్ చేసి వాహనాలను సీజ్ చేస్తున్నారు. జిల్లాలో నిర్మాణం కోసం ఇసుక అవసరం ఉన్నా అనుమతులు ఇవ్వ కపోవడం వల్లనే పెద్ద ఎత్తున అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

జిల్లాలో ఇసుకకు పెరిగిన డిమాండ్

జిల్లాలో ఇసుకకు డిమాండ్ భారీగా పెరిగింది. ఇళ్ల నిర్మాణంతో పాటు వెంచ ర్లు, ఇతర నిర్మాణాలు జరుగుతుండటం వల్ల ఇసుక వినియోగం ఎక్కువైంది. రోడ్ల తో పాటు ప్రభుత్వ భవనాలు కూడా నిర్మా ణాలు జరుగుతుండటంతో ఎక్కువ మొ త్తంలో వినియోగిస్తున్నారు. వీటితో పాటు జాతీయ రహదారుల నిర్మాణంతో పాటు బ్రిడ్జిల నిర్మాణం, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మా ణం కొనసాగుతోంది. వీటన్నింటికీ ఇసుక అవసరం కావడంతో ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ అన్ని పథకాలకు ఇసుక కోసం అనుమతులు ఇస్తున్నా ప్రైవేటు అవసరాలకు ఇవ్వక పోవడం వల్ల ఎక్కువ మొత్తంలో తవ్వ కాలను చేస్తున్నారు. అక్రమంగా రాత్రి వేళల్లో తరలించడంతో పాటు భారీ ఎత్తున నిలువ ఉంచి అమ్మకాలు చేస్తు న్నారు. ఇసుకకు డిమాండ్ ఉండటం ఇత ర జిల్లాల నుంచి తెప్పిస్తే ఎక్కువ మొత్తం లో ఖర్చు అవుతుండటంతో మంజీరా ఇసు కపై ఎక్కువ మంది దృష్టి పెట్టడంతో అక్ర మ తవ్వకాలు ఎక్కువగా జరుగు తున్నాయి. మంజీరా వెంట బిచ్కుం ద నుంచి రేంజల్ మండలాల వరకు నిత్యం ఈ తవ్వకాలు కొనసాగుతున్నాయి. బిచ్కుంద, బీర్కూర్, పోతంగల్, సాలూరా, రేంజల్ మండలం పరిధిలో మంజీరా నదీ ఉంది. ఈ నదీలోని ఇసుక సన్నగా ఉండ టం వల్ల ఇళ్ల నిర్మాణానికి ఎక్కువగా డిమాండ్ ఉంది. నిజామాబాద్ జిల్లాతో పాటు నిర్మల్, కామారెడ్డితో పాటు ఇతర జిల్లాల వారు కూడా ఇక్కడి ఇసుకను అడుగుతుండటంతో అనుమతులు లేకుం డా ఎక్కువ మొత్తంలో తవ్వకాలను చేస్తు న్నారు. నాందేడ్ జిల్లాకు సంబంధించిన వారు కూడా ఇక్కడి ఇసుకను తీసుకు వెళ్తున్నారు. ప్రభుత్వ అవసరాల కోసం తహసీల్దార్లకు డీడీలు కడితే అనుమతులు ఇస్తున్నారు. టన్ను లెక్కన తీసుకువెళ్లేం దుకు ఈ అనుమతులు మంజూరు చేస్తు న్నారు. ప్రైవేటు అవసరాలకు మాత్రం ఎక్కువగా ఇవ్వడం లేదు. మంజీరా వెంట ఉన్న బిచ్కుంద, బీర్కూర్, పోతంగల్, సాలూరా, రేంజల్ మండలాల పరిధిలోని తహశీల్దార్లు ఈ అనుమతులను మంజూ రు చేస్తున్నారు. ఈ మండలాల పరిధిలోనే ఎక్కువగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. రాత్రివేళల్లో జేసీబీల ద్వారా తవ్వకాలను చేస్తూ ట్రాక్టర్లు, టిప్పర్ల

మిగతా 8వ పేజీలో...


పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పోచారం, కలెక్టర్

పేదలకు అందుబాటులోకి మెరుగైన వైద్య సేవలు

- విద్య, వైద్యం, సాగు, తాగునీటి రంగాలకు ప్రాధాన్యం
- ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి
- కలెక్టర్‌తో కలిసి చందూర్‌లో పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన
- స్థలం దాతలకు ఘనంగా సత్కారం

మోస్రా, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందు బాటులోకి తేవడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసా య సలహాదారు బాన్సువాడ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని చం దూర్ మండల కేంద్రంలో రూ.1.44కోట్ల నిధులతో చేపట్టనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి పోచారం శ్రీనివాస్ రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడు తూ.. విద్య, వైద్యం, సాగు, తాగునీరు, రవాణా, విద్యుత్ సరఫరా వంటి వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగానే నియోజకవర్గంలోని నస్రుల్లాబాద్, చందూర్ మండల కేంద్రా లకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేయించామని తెలిపారు. నిజానికి ఏడాది క్రితమే చందూర్‌కు పీహెచ్‌సీ మంజూరైనప్పటికీ స్థలం అందుబాటులో లేకపోవడంతో జాప్యం జరిగిందన్నారు. ఈ క్రమంలో స్థా నికులైన చంద్రావతి, విద్యాసాగర్ దంపతులు ముందుకు వచ్చి స్వర్గీయ సుబ్బారావు పేరిట స్థలాన్ని దానం చేయడంతో పీహెచ్‌సీ నిర్మాణానికి మార్గం సుగమం అయిందన్నారు. ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందు బాటులోకి రావాలనే సదాశయంతో సుమారు కోటి రూపాయల విలువ చేసే భూమిని అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారని కొనియాడిన పోచారం స్థల దాతలైన చంద్రావతి, విద్యాసాగర్ దంపతులను స్థానికు లతో కలిసి ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రా నికి స్వర్గీయ సుబ్బారావు పేరిట నామకరణం చేయడం జరుగుతుందని ప్రకటించారు. బాన్సువాడ నియోజకవర్గంలోని మోస్రా హనుమాజీ పేట్, పోతంగల్, రుద్రూర్‌లలో ఇది వరకే పీహెచ్‌సీలు ఉండగా కొత్తగా

మిగతా 8వ పేజీలో...

మూకుమ్మడి ఆత్మహత్యల కలకలం!

- తెలియరాని ఎస్సై, మహిళా కానిస్టేబుల్, యువకుడి ఆత్మహత్యలకు కారణాలు
- ఆధారాల్లేక అంతర్మథనంలో పోలీసులు
- కీలకం కానున్న పోస్టుమార్టం రిపోర్టు
- మృతుల ఫోన్‌కాల్స్.. కుటుంబీకులు తెలిపే వివరాల ఆధారంగా విచారణ
- వివాహేతర సంబంధ కోణంలోనూ దర్యాప్తు
- విచారణ తర్వాతే వివరాలు వెల్లడిస్తాం : ఎస్పీ సింధూశర్మ
- బాధిత కుటుంబీకులను ఓదార్చిన ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ


కానిస్టేబుల్ శృతి, నిఖిల్‌ల మృతదేహాలు



ఎస్సై సాయికుమార్ మృతదేహం

కామారెడ్డి, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి) /కామారెడ్డి టౌన్/ సదాశివనగర్: కామారెడ్డి జిల్లాలో మూకుమ్మడిగా ముగ్గురి ఆత్మహత్యల ఘటన మిస్టరీగానే మిగిలింది. ఆత్మహత్యకు పాల్పడిన వీరి ముగ్గురిలో ఎవరూ బతికి బయటపడకపోవడంతో ఆధారాలు లేకపోయాయి. వీరు అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్దకు ఎందుకు వెళ్లారు..? ఎందుకు ఆత్మహత్యచేసుకున్నారు.. ? వీరి ముగ్గురు మధ్య ఉన్న సంబంధం ఎంటి..? అనే ప్రశ్నలపై పోలీసులు విచా రణ జరిపేందుకు ఆధారాలు లేక అంతర్మథనంలో పడ్డట్లు తెలుస్తోంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాలంటే పోస్టుమార్టం రిపోర్టుతో పాటు మృతుల ఫోన్‌కాల్స్ డాటా, కుటుంబీకులు ఇచ్చే వివరాలే కీలకం కానున్నాయి. వీటి ఆధారంగానే పోలీసులు విచారణ చేపట్టే అవకాశం ఉంది. అదే సమయంలో వీరు ముగ్గురి మధ్య ఉన్న బంధం వివా హేతరమా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేపట్ట నున్నట్లు తెలుస్తోంది.

• ఎస్సై మృతదేహం లభ్యం

భిక్కనూరు ఎస్సై సాయికుమార్ (32), బీబీపేట మహిళా కానిస్టేబుల్ శృతి (25), బీబీపేట సొసైటీ కాంట్రా క్టు కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ (28) సదాశివనగర్ మండలం కుప్రియల్ గ్రామశివారులోని అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువులో ముగ్గురూ దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. బుధవారం అర్ధరాత్రి శృతి, నిఖిల్ మృతదేహాలను పోలీ సులు రెస్క్యూ ఆపరేషన్ ద్వారా వెలికితీశారు. వెంటనే మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై మృతదేహం లభ్యం కాకపో వడంతో గురువారం ఉదయం వరకు రెస్క్యూ ఆపరే షన్‌టీం గాలింపు చర్యలు చేపడుతూ వచ్చారు. జిల్లా అదనపు ఎస్పీ నరసింహారెడ్డి పర్యవేక్షణలో సుమారు 10 గంటల పాటు కొనసాగిన పోలీసుల రెస్క్యూ ఆపరేషన్ ఫలించడంతో ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఎస్సై సాయికుమార్ డెడ్‌బాడీని వెలికితీశారు. జిల్లా ఎస్పీ సింధూశర్మ ఘటనా స్థలానికి చేరుకుని ఎస్సై మృతదే హాన్ని పరిశీలించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తమై కామారెడ్డి ఆసుపత్రికి తర లించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు

మిగతా 8వ పేజీలో...


ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు విడుదలవుతున్న నీరు

ఎస్సారెస్పీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

మెండోర, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి పంటల సాగు కోసం ప్రధానకాలువలకు నీటి విడుదల కొనసాగుతుంది. ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ఈ సందర్భంగా కాకతీయ కాలువకు 3000 క్యూసెక్కులు, లక్ష్మి కాలువకు 150క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 400 క్యూసెక్కులు, అలీసాగర్ గుత్పకు 300 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 450క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 152క్యూసెక్కుల నీరు ఔట్‌ఫ్లో పోతుందని వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (90టీఎంసీ)లు సామర్థ్యం కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటిమట్టం 1090.80 అడుగులు (70.658టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని పేర్కొన్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి ప్రాజెక్టులోకి 282టీఎంసీల వరదనీరు చేరగా ప్రాజెక్టు వరకు వరద గేట్ల ద్వారా ప్రాజెక్టు ప్రధాన కాలువల ద్వారా 210టీఎంసీల నీరు విడుదల చేయడం జరిగిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌ల ద్వారా చెరువులను నింపాలి

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

ఏర్గట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌ల ద్వారా మండలంలోని చెరువులను నింపాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ ఎస్సారెస్పీ సీఈ సుధాకర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. గురువారం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిని రైతులు కలిసి విన్నవించారు. దీంతో వారం రోజుల్లో డి-18, డి-19, డి-20 ఉపకాలువల ద్వారా చెరువులను నింపాలని ఎమ్మెల్యే సీఈతో ఫోన్‌లో మాట్లాడారు. లేనియెడల రైతులతో కలిసి ఆందోళన చేస్తామని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నారు.

సీఎం ఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గురువారం పంపిణీ చేశా రు. సీఎం సహాయ నిధి ద్వారా 132 మంది లబ్ధిదారులకు 30 లక్షల 50వేల 600 విలువైన చెక్కులను అందించారు. బాధితుల నుంచి వస్తున్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే సీఎం సహా యనిధికి పంపిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. బాధితులు దర ఖాస్తు చేసుకున్న మొత్తంలో 15 నుంచి 20 శాతం వరకే ప్రభు త్వం చెల్లిస్తుందన్నారు. దీనివల్ల బాధిత కుటుంబాలకు చికిత్స భారంగా మారుతుందన్నారు. శీతాకాలం శాసనసభ సమావేశం లో సీఎంను కలిసి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ జాప్యంపై వివరించానన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి 50శాతం వరకు చెల్లించే విధంగా చూడాలని కోరామన్నారు. నియోజక వర్గంలోని బాధితులందరికి చెక్కులు వచ్చే విధంగా కృషి చేస్తున్నామని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాలం రాజుతో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.

పోతంగల్‌లో జేసీబీ పట్టివేత

● ప్రత్యేక బృందం విధులను అడ్డుకున్న వ్యక్తిపై కేసు



పోతంగల్‌లో జేసీబీని పట్టుకున్న ప్రత్యేక బృందం సభ్యులు

కోటగిరి,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ శాఖ గత ఐదు రోజుల నుంచి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. రాత్రివేళ 9నుంచి ఉదయం 6గంటల వరకు ఈ బృందం మంజీర పరిసర గ్రామాల్లో పర్యటిస్తూ ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తుంది. కొందరు అక్రమార్కులు ఉదయం వేళ ఇసుక అనుమతులు పొంది అక్రమంగా డంపు చేస్తూ రాత్రివేళలో టిప్పర్లు నింపి పంపుతున్నారు. పోతంగల్ మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి ఇసుకను జేసీబీ సాయంతో టిప్పర్‌లలో నింపి తరలించారు. ఈ విషయం రెవెన్యూ సిబ్బంది పోతంగల్ చెక్ పోస్టు వద్ద టిప్పర్‌ను పట్టుకున్నారు. ఆ టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా పోతంగల్ గ్రామానికి చెందిన భజరంగ్ దత్తు అనే వ్యక్తి రెవెన్యూ సిబ్బందిని దౌర్జన్యంగా పక్కకు తోసి వేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. సిబ్బంది కారులో వెళ్లకుండా అడ్డుకుని టిప్పర్‌ను తరలించినట్లు ఆయన తెలిపారు. ఇసుకను లోడ్ చేసిన జేసీబీని రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సిబ్బంది విధులను అడ్డుకున్న భజరంగ్ దత్తుపై రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదని సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు



వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మెండోర, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలో దూదిగాం గ్రామానికి చెందిన కుంట భోజన్న తాగిన మైకంలో పోలీస్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడంతో మెండోర ఎస్సై నారాయణ భోజన్నను అదుపులోకి తీసుకొని ఆర్మూర్ కోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చాగా రెండు రోజుల జైలు శిక్ష విధించడం జరిగిందని ఎస్సై తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం తాగిన మైకంలో 100డయల్ అర్ధరాత్రి 14సార్లు తనకు రోడ్డు ప్రమాదంలో గాయాలు అయ్యాయని 108కి పలుమార్లు డయల్ చేసి విధులకు అటంకం కలిగించడంతో అతనిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని వివరించారు. తాగిన మైకంలో 100, 108కి ఫోన్ చేసినట్టు ఒప్పుకోవడంతో ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చినట్టు తెలిపారు. ప్రజలకు పని చేయడానికి పోలీస్ వ్యవస్థ ఉందని, పోలీసులకు విధులకు అటంకం కలిగించే విధంగా తాగిన మైకంలో ఫోన్ చేస్తే ఎంతటివారైనా సరే వదిలే ప్రసక్తేలేదని ప్రజలు గమనించాలని ఎస్సై అన్నారు.

నవీపేట రైల్వేగేటు వద్ద కొనసాగుతున్న పనులు



నవీపేటలో రైల్వేగేటు మూసి ఉంచిన దృశ్యం

నవీపేట,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి):నవీపేటలోని 188నెంబర్ గల ప్రధానరైల్వే గేటును అధికారులు గురువారం ఉదయం నుంచి మూసి వేశారు. అత్యవసర మరమ్మత్తుల కారణంగా నవీపేట ప్రధాన రైల్వేగేటును గురువారం నుంచి ఈ నెల 30వరకు మూసి వేయడం జరుగుతుందని ఇది వరకే రైల్వే అధికారులు ప్రకటించారు.ప్రస్తుతం గేటువద్ద పట్టాల మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి.ఇదిలా ఉండగా రైల్వేగేటు మూసివేత విషయం తెలియని పలువురు వాహనదారులు,ప్రయాణికులు గేటు వద్దకు వచ్చి అసలు విషయం తెలుసుకున్న తర్వాత ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ గమ్యాలకు చేరుకుంటున్నారు.

మోర్తాడ్‌లో ఇసుక లారీ పట్టివేత

మోర్తాడ్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి):మోర్తాడ్ నుంచి అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నామని ఎస్సై విక్రం తెలిపారు. బుధవారం రాత్రి లారీలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని తగు చర్యల కోసం రెవెన్యూ అధికారులకు అప్పగించామని ఎస్సై తెలిపారు.

బాల్కొండ ప్రింట్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక

ముప్కాల్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం ప్రింట్ మీడియా గురువారం నూతన కార్యవర్గాన్ని ఏక్రగీంగా ఎన్నుకున్నారు. ప్రింట్ మీడియా అధ్యక్షునిగా పిల్లెండ్ల శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా నార్ల రాజు, మురళీమోహన్, ప్రధానకార్యదర్శిగా రాజుల రామనాథం, కోశాధికారిగా షాదుల్లా, సలహాదారులుగా మల్లేష్‌గౌడ్, భూమేశ్వర్, స్వామిలను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ సలహాదారును కలిసిన వేణుగోపాల్ యాదవ్

కమ్మర్‌పల్లి, డిసెంబరు 26: (ఆంధ్రజ్యోతి) తెలంగాణ ప్రభుత్వ సలహాదారు (ప్రజావ్యవహారాలు) వేం నరేందర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన స్వగృహంలో కలిసి శాలుకప్పి పుష్పగుచ్ఛాం అందించి పుట్టిరోజు శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

ముప్కాల్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి):బాల్కొండ మండల కేంద్రానికి చెందిన మహ్మద్‌రఫీ తాగి ఆటో నడుపుతూ డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు కాగా గురువారం ద్వితీయ శ్రేణి మెజిస్ట్రేట్ అతనికి రెండు రోజుల జైలుశిక్ష, విధించినట్టు ఎస్సైనరేష్ తెలిపారు. ఆటోడ్రైవర్‌లు గాని, ద్విచక్ర వాహనదారులు తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

మేరు సంఘంలో నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



మేరు సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెర్కిట్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేరు సంఘ భవనంలో నూతన సంవత్సరం 2025క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్మూర్ పట్టణ మేరు సంఘం ముఖ్యసలహాదారులు కొత్తూరు సుదర్శన్, రాజుల దేవి వసంత్, వెల్కమ్ నారాయణ చేతుల మీదుగా నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ ఘనంగా నిర్వహిస్తున్నామని మేర కులస్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాజులదేవి రవినాథ్, ప్రధానకార్యదర్శి డికొండ లక్ష్మణ్, కోశాధికారి సంఘి గంగాధర్, కొత్తూరు ఆనంద్, సంఘ గోవర్ధన్, మేరు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



బోధన్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు



ఆర్మూర్‌లో..

బోధన్‌రూరల్,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం సీపీఐ జెండాను జిల్లా నాయకురాలు స్వరూప రాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాతంత్రం రావాలని పోరాడి ఎంతోమంది త్యాగాలు చేశారని గుర్తు చేశారు. నైజంకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సువర్ణ అక్షరాలతో రైతులలో లిఖించబడిందన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని లేనిపక్షంలో ఉద్యమాలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుధాకర్, జయమ్మ, సలీం, కృష్ణ, వెంకటేష్, శంకర్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: పట్ట ణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీపీఐ నిజామాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆరేపల్లి సాయిలు మాట్లాడుతూ సీపీఐ పార్టీ ఆవిర్భావించి వంద ఏళ్ల పూర్తి చేసుకున్నదని దేశ స్వాతంత్ర్య ఉద్యమంతో పటు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో సీపీఐ పార్టీ కీలక పాత్ర పోషించిందని అన్నారు. అంబేద్కర్‌చౌరస్తా వద్ద నూతనంగా నిర్మించిన సీపీఐ జెండా గద్దెను ప్రారంభించి జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, ఫిరోజ్, మౌలానా, నవీన్, శీను, కిష్టయ్య, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలో గురువారం భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ ప్రాంగణంలో సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మతోన్మాద బీజేపీ దళితులు, ఆదివాసులు, మహిళలు, మైనారిటీలపై దాడులు పెంచిందని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటిన రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలు చేయలేదన్నారు. ప్రజా సమస్యలపై సీపీఐ ఆనాటి నుండి నేటి వరకు రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. నాటి స్వాతంత్ర పోరాటంతో పాటు తెలంగాణ మలిదశ ఉద్యమంలో సీపీఐ కీలకపాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దుబాస్ రాములు, రాజు, రాములు, శివరాజు, శంకర్, హన్మాండ్లు, ఇమ్రాన్, నారాయణ, సాయిలు, అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి



కబ్జా చేసిన స్థలంలో ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

కోటగిరి,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలో నిజాంసాగర్ 28/1/2 కెనాల్ సరిహద్దు స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కబ్జా చేసిన స్థలంలో నిర్మాణం చేపట్టడాన్ని సీపీఐ నాయకులు గురువారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు విఠల్ గౌడ్ మాట్లాడుతూ బస్టాండ్ సమీపంలో కోట్ల రూపాయలు విలువ చేసే ఇరిగేషన్ కెనాల్ బౌండరీ భూములను దర్జాగా కబ్జా చేసిన వారిపై చర్యలు చేపట్టకపోవడం విడ్డూరమని ఆయన పేర్కొన్నారు. కెనాల్ నుండి 33ఫీట్ల రహదారి ఉంటుందన్నారు. రహదారి స్థలాన్ని కబ్జా చేసుకుని నిర్మాణం చేపట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కాలువల్లో పూడిక, ముళ్ల పొదలు పెరిగితే జేసీబీల సహాయంతో కాలువలను శుభ్రం చేసే అవకాశం ఉంటుందన్నారు. కాలువ స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాములు, శివరాజ్, నారాయణ, శంకర్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో వీర్ బాల్‌దివస్



ఆర్మూర్‌లో అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో గురువారం వీర్ బాల్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుగోవింద్‌సింగ్ వారి కుమారులైన అజీత్‌సింగ్, జగర్‌సింగ్, జరోవర్‌సింగ్, పతేసింగ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధులు కలిగోట గంగాధర్, జెస్సు అనిల్ మాట్లాడుతూ 1705 సంవత్సరంలో మొఘలైలు ఈ దేశాన్ని దురక్రమంగా అక్రమించుకోవడానికి జీర్ణించుకోలేనటువంటి సిక్కుల పదవ గురువు అయిన గూరుగోవింద్‌సింగ్ తన ఇద్దరు కుమారులను వెంట బెట్టుకొని మొఘలైలతో యుద్ధం చేశారని అన్నారు. మరో ఇద్దరు కుమారులను అమ్మమ్మ వద్ద వదిలి వెళ్లారని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న మొఘలైలు ఇద్దరు పిల్లతో పాటు అమ్మమ్మను సైతం నిర్బంధించి ఇస్లాం మాతాన్ని స్వీకరిస్తే వదిలేస్తామని చెప్పగానే ప్రాణత్యాగం చేస్తామని, తన ధర్మాన్ని ఎట్టి పరిస్థితుల్లో మరమని కరఖండిగా చెప్పడంతో మొఘలైల రాజు వజీర్‌ఖాన్ వారి జీవసమాధి చేయాలన్న లక్ష్యంతో డిసెంబర్ 26న బలీ చేశారని, దేశం కోసం, ధర్మం కోసం ప్రాణత్యాగం చేసిన ఈ దినాన్ని వీర్ బాల్‌దివస్‌గా జరుపుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధానకార్యదర్శులు పొల్కం వేణు, పులి యుగంధర్, బీజేపీ సీనియర్‌నాయకులు బొట్ల విజయ్, మందుల వీరభద్రి, విజయానంద్, కార్తన్ మధు, దక్షిణమూర్తి, బారడ్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఘనంగా పడిపూజ



అయ్యప్ప దేవాలయంలో పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఓం.. ఓం అయ్యప్ప.. శరణ్యం శరణ్యం అయ్యప్ప అంటూ అయ్యప్ప శరణుఘోషలో అయ్యప్ప స్వాములు పడిపూజను ఘనంగా నిర్వహించారు. గురువారం బోధన్ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఘనంగా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. 18మెట్లను అందంగా అలంకరించి గణపతి, కుమారస్వామి, అయ్యప్ప స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి పుష్పార్చన, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. 18మెట్లకు హారతులు ఇచ్చి భక్తిశ్రద్ధలతో పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. పడిపూజ కార్యక్రమానికి గురు స్వాములు, అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అధిక సంఖ్యలో హాజరైన అయ్యప్ప స్వాములు భక్తిశ్రద్ధలతో భజనలు, కీర్తనలు నిర్వహించారు.

జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం

జక్రాన్‌పల్లి,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి):మండలంలోని తొర్లికొండ గ్రామంలో గురువారం జిల్లా యువజన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్‌ను ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనక రవి, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జక్రాన్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జనరల్ సెక్రెటరీ వినోద్‌లు కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్వామి, రవి, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

రెంజల్,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన తూర్పు రాజు(35) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ సాయన్న తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పు రాజు అనే వ్యక్తి అదే గ్రామానికి ఎండీ లాయకత్ అనే వ్యక్తి వద్ద పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం కూడా పశువులను కాయడానికి వెళ్లగా పశువులను మేపే క్రమంలో పక్కనే గల చెరువులో కాలు జారి పడి మృతి చెందడం జరిగిందని గ్రామానికి చెందిన పాముల గంగాధర్ తెలుపగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు తెలుపడగా ఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ సాయన్న మత్స్యకారులతో మృతదేహన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య తూర్పు రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయన్న తెలిపారు.

ముగ్గురికి జైలు శిక్ష

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి గురువారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ సాధారణ జైలు శిక్ష విధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన ప్రశాంత్, అజాద్, ప్రవీణ్‌లకు రెండు రోజుల పాటు సాధారణ జైలు శిక్ష విస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ తీర్పు వెలువడించినట్టు పోలీసులు తెలిపారు.

చక్కెర కర్మాగారాలను పున:ప్రారంభించాలి

● జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి

బోధన్‌రూరల్,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం మూతబడ్డ చక్కెర కర్మాగారాలను వెంటనే పునరుద్ధరించాలని జనతాదళ్ పార్టీ జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి అన్నారు. గురువారం బోధన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో సిఫారసు కమిటీని వేసిందన్నారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ ప్రారంభ దశలోనే 16వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించిందన్నారు. కాలక్రమేనా ఫ్యాక్టరీ భూములు కబ్జాకు గురవుతున్నాయని ఆరోపించారు.చక్కెర కర్మాగారాల పున:ప్రారంభం కోసం కార్మికులు, చెరకు రైతులు అనేక ఉద్యమాలు చేశారన్నారు.ప్రభుత్వాలు మారిన మూతబడ్డ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీలు ప్రారంభానికి నోచుకోవడంలేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఒకరిపై ఒకరు విపక్షాన అస్త్రాలు ఉపయోగించడం సర్వసాధారణం అయిందన్నారు. ప్రజల సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వాలకు మనుగడ సాధ్యం కాదని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీతో పాటు చక్కెర ఫ్యాక్టరీని తిరిగి పున:ప్రారంభించి కార్మికులను,రైతులను ఆదుకోవాలని డిమాండ్‌చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ముప్కాల్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి):ముప్కాల్ మండల కేంద్రంలోని 44వ జాతీయరహదారిపై బుధవారం రోడ్డు దాటుతుండగా చందర్ రుషికేష్(67) గుర్తుతెలియని వాహనం ఢీకొని చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. బిహార్ రాష్ట్రానికి చెందిన చందర్ రుషికేష్ రెండు నెలల క్రితం కూలిపని కొరకు ముప్కాల్ కూలీ పనిచేస్తూ రోజు మాదిరిగానే రోడ్డు దాటే సమయంలో నిర్మల్ వైపు నుంచి ఆర్మూర్ వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా బాలమైన గాయాలయ్యాయి. నేషనల్ హైవే పోలీసులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం మృతిచెందగా మృతుడు కుమారుడు నీరజ్ రుషికేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలి పారు.

ప్రహరీ నిర్మాణం కోసం భూమిపూజ



బోధన్‌లో భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయం భవన గదుల పటిష్ట నిర్మాణ పనుల కొరకు గురువారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయ కమిటీ చైర్మన్ హరికాంత్ చారి మాట్లాడుతూ భక్తుల కొంగుబంగారం విరాజిల్లుతున్న పురాతన చరిత్ర గల ఏకచక్రేశ్వరాలయం ఆవరణలో రూ.5లక్షలతో చేపట్టనున్న పునాది పటిష్ట నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించామన్నారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గంగాదర్ రావు పట్వారీ, శివాలయం కమిటీ మాజీ చైర్మన్ బీర్కూర్ బుజ్జి, హనుమాన్ మందిర్ కమిటీ చైర్మన్ గుండెటి శంకర్, గ్రామాభివృద్ధి కమిటీ డైరెక్టర్లు లక్ష్మణ్, యాదవ్, భూమేష్, సూర లింగం, గ్రామ పెద్దలు శ్రీనివాస్, ఆలయ పూజారి శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో బాంకిట్‌హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే



బాంకిట్‌హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయరహదారి పక్కన నూతనంగా నిర్మించిన టీఎస్ఆర్ బాంకిట్‌హాల్‌ను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. గురువారం మోర్తాడ్‌లో ఉదయం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వేదపండితులు స్వాగతం పలికారు. పూజ కార్యక్రమాలు అనంతరం నూతనంగా నిర్మించిన బాంకిట్‌హాల్‌ను నూతన సదుపాయాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట తీగెల సత్యనారాయణ, ప్రేమల అజయ్‌రెడ్డి, బోగ ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలకు మోతె విద్యార్థి ఎంపిక



విద్యార్థి వేదాన్ష్

వేల్పూర్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం మోతె ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి జి.వేదాన్ష్ రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వైద్య గణేష్, పీడీ సురేష్‌కుమార్‌లు తెలిపారు. ఈనెల 27, 28, 29తేదీలలో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే సీఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో వేదాన్ష్ పాల్గొనున్నట్లు వారు తెలిపారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వేదాన్ష్‌ను హెచ్‌ఎం గణేష్, పీడీ సురేష్‌కుమార్, గ్రామ కబడ్డీ కోచ్ పరకంజ్యోతి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

నాగేపూర్‌లో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



భక్తులకు ప్రవచనలు అందజేస్తున్న శ్రీసిద్దేశ్వర మహరాజ్, కృష్ణమహరాజ్

నవీపేట,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన గురువారం యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, మహ పూజ, బలి, మహ పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలలో మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ పిట్ల కృష్ణ మహరాజ్, లింగమయ్య గుట్ట ఆలయ వ్యవస్థాపకులు శ్రీ సిద్దేశ్వర మహరాజ్‌లు హజరై భక్తులకు ప్రవచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బినోల గ్రామ పురోహితులు కృష్ణ ప్రసాద్ జోషి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



ఊట్‌పల్లిలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన దృశ్యం

సాలూర,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో శ్రీరామ హనుమాన్ ఆలయంలో గురువారం వైభవంగా హనుమాన్ విగ్రహాన్ని పున:ప్రతిష్ఠించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ విగ్రహ పున:ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

త్వరిత గతిన పనులు పూర్తి చేయండి

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి



నందిపేటలో డబుల్ రోడ్డు, డివైడర్‌ను పరిశీలిస్తున్న ఆశన్నగారి జీవన్ రెడ్డి

నందిపేట, డిసెంబరు 26 ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులు కూడా పూర్తి చేయడం చాతకాని పనితనమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం నందిపేట మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ రోడ్డు పనులు, డివైడర్‌ను ఆయన పరిశీలించారు. తమ హయాంలో రూ.12 కోట్ల వ్యయంతో నందిపేటకు మెరుగులు దిద్దాలనే ఉద్దేశ్యంతో డబుల్ రోడ్డు నిర్మించామని, అప్పుడు పనులు ఎలా ఉన్నాయో ఇప్పుడు అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సెంటర్ లైటింగ్ పనులు లేవని, విద్యుదీకరణ లేదని, రోడ్డు పనులు మధ్యలోనే నిలిపేశారని, కనీసం డివైడర్ మధ్యలో పూల చెట్లు, చమాన్‌కు నోచుకోవడంలేదని జీవన్‌రెడ్డి ఆరోపించారు. కాని ఆర్మూర్ ఎమ్మెల్యేగా గెలిచిన కుటుంబీకుల ఆనందం చూడడానికి మాత్రం ఆయన షాపు ముందర డివైడర్ యూటర్న్‌కు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. గతంలో యూటర్న్ కోసం ప్రయత్నిస్తే గ్రామస్థులు, నాయకులు అడ్డుకున్నారని, మరోసారి యూటర్న్ కోసం ఇటీవల అధికారులు మార్క్ ఇచ్చినట్లు సమాచారం ఉందని ఆయన వివరించారు. యూటర్న్ కోసం డివైడర్‌ను తొలగిస్తే ప్రతీ షాపు ముందర యూటర్న్ చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈకి, ఈఎన్‌సీకి ఫిర్యాదు చేయను న్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ హుస్సేన్, మాజీఎంపీటీసీ సభ్యులు బాల గంగాధర్, నాయకులు ఏర్రం ముత్యం,సురేష్, కొత్తూర్ భరత్, అభిలాష్, ఎడ్డిగారి దినేష్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన డివేంద్ర(20) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని పిప్రి గ్రామంలోని డివేంద్ర తన నివాసంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగగా చుట్టు పక్కల ప్రజలు గమనించి నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలను తెలియాల్సి ఉందని ఎస్‌హెచ్‌వో తెలిపారు. గురువారం చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌హెచ్‌వో తెలి పారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్టు ఆయన తెలిపారు.



ఇంటింటి సర్వేలో పాల్గొన్న ఎంపీడీవో

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఇక్కట్లు

మద్నూర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా పాలన దరఖాస్తుల్లో భాగంగా ఉమ్మడి మద్నూర్ మండలంలో 16,867 మంది తమకు ఇల్లు లేవని అర్జీలు పెట్టుకున్నారు. ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ పేరుతో ఇల్లు కేటాయించాలని, దరఖాస్తు చేసుకున్న కుటుంబాలను సర్వే చేపట్టాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఆ దిశగా మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్నారు. సర్వేలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో సర్వేలో సిబ్బందికి ఇక్కట్లు తప్పడం లేదు. పలు ప్రాంతాల్లో గ్రామాల్లో సిగ్నల్స్ సమస్యతో సర్వేలు జాప్యం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించాలని లక్ష్యంతో ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారంటీల అమలు కోసం గ్రామాల వారీగా స్వీకరించిన దర ఖాస్తుల ఆధారంగా అర్హులైన సర్వే సిబ్బంది గుర్తిస్తున్నారు. దర ఖాస్తులు చేసుకున్న వారికి ప్రత్యేక ఐడి సంఖ్యను ప్రభుత్వం కేటా యించి దర ఖాస్తుల్లో ఇల్లు లేని వారిని సర్వే చేసి మొదటి విడతలో ఎంపిక చేయనున్నారు.

● 56 శాతం సర్వే పూర్తి

ఉమ్మడి మద్నూర్ మండలంలోని 34 గ్రామపంచాయతీల నుంచి 16,867 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఇప్పటి వరకు 57 శాతం మాత్రమే దరఖాస్తులు సర్వే పూర్తయింది. అయితే సర్వేలో సాంకేతిక పరంగా వివరాల నమోదు సేకరణలో అవాంతరాలు ఎదురవు తున్నా యి. సాఫ్ట్‌వేర్‌లో అర్హుల ఇళ్లను గూగుల్ మ్యాపింగ్ చేయాల్సి ఉం టుంది. అయితే కొన్ని ప్రాంతాల్లో దరఖాస్తు చేసుకున్న వారి సర్వేకు వెళ్లిన అధికారులు లబ్ధిదారులు తమ ఇళ్ల వద్ద లేకపోవడంతో వారు వచ్చేవరకు ఎదురుచూడాల్సి వస్తుంది. ఈ కారణంగా ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి సర్వే పూర్తి చేయలేకపోతున్నారు. దీనికి తోడు గా సిగ్నల్స్ సరిగ్గా రాకపోవడం వెబ్‌సైట్ సకాలంలో ఓపెన్ కాక పోవడంతో సర్వే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా మార్పులు, చేర్పులు లేకపోవడంతో ఎంతోమంది ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో పర్వత కోల్పోయే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి మరోసారి అవకాశం కల్పిస్తే పేదలకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

● ఇప్పటి వరకు 56 శాతం సర్వే పూర్తి

రాణి, ఎంపీడీవో

ఉమ్మడి మద్నూర్ మండలంలోని థిఎ గ్రామపంచాయతీ పరిధిలో 16,867 దరఖాస్తులు రాగా వాటిలో 56 శాతం ఇండ్ల సర్వే పూర్తి చేశామని .సాంకేతిక సమస్యలు వస్తున్నప్పటికీ వాటిని అధిగమిస్తూనే సర్వే ప్రక్రియను ముమ్మరం చేస్తున్నామని ఈ నెల 31 వరకు సర్వే పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టామని సాధ్యమైనంత మేరకు పూర్తయ్యే విధంగా ఎప్పటికప్పుడు సర్వే నెంబర్ పరిశీలిస్తున్నామని అన్నారు.



పొగమంచు వల్ల లైట్లు వేసుకుని వెళుతున్న వాహనదారులు

కామారెడ్డిలో కమ్మేస్తున్న పొగమంచు

● వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

● చలితో ప్రజలకు తప్పని అవస్థలు

కామారెడ్డిటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాను పొగమంచు కమ్మేస్తుంది. డిసెంబరు మొదటి వారం నుంచి చలి మరింత తీవ్రతరం అయింది. పొగమంచు కురుస్తుండడంతో ఉదయం పూట పనుల కోసం వెళ్లె వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముందు వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో లైట్లు వేసుకుని ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అదేవిధంగా ఉదయం, రాత్రి వేళలో చల్లటి గాలులు వీస్తుండడంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గురువారం కామారెడ్డి జాతీయ రహదారిపై ఉదయం 7 దాటిన పొగమంచు కమ్మేసిన, వాహనదారులు నానా అవస్థలు పడుతూ ప్రయణించిన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరాలో బంధించింది.



సివిల్ అసిస్టెంట్ సర్జన్ల

మార్పులో ఆంతర్యమేంటి?

● అత్యవసర సేవలు అందించాల్సిన ఆసుపత్రిలో చిన్నచూపు చూస్తున్నారని ప్రజల ఆగ్రహం



ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



ఆస్పత్రిలో పేర్లు నమోదు చేసుకుంటున్న దృశ్యం

ఆర్మూర్ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులైన ఆర్మూర్, బాల్కొండ, మోర్తాడ్ ఆసుపత్రిల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌ల మార్పుల్లో అంతర్యమేమిటో అర్థం కావడం లేదు. ఇటీవల సాధారణ బదిలీలలో భాగంగా వచ్చిన సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లను యుపీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు బదిలీ చేశారు. ఆసుపత్రిలో చార్జ్ తీసుకున్న ఒక్క రోజుల్లోనే బదిలీ చేయడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆర్మూర్ ఆసుపత్రికి నలుగురు సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు రాగా ఒకే రోజులో వారిని డొంకేశ్వర్, జక్రాణ్‌పల్లి, కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని యుపీహెచ్‌సీ, పీహెచ్‌సీ కేంద్రాలకు బదిలీ చేశారు. అలాగే బాల్కొండ ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీపై వచ్చిన ఇద్దరు సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లను సైతం ఒకే రోజులో ఏర్గట్ల, మెండోరకు బదిలీ చేయగా మోర్తాడ్‌కు వచ్చిన సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లను జిల్లా కేంద్రంలోని యుపీహెచ్‌సీ కేంద్రాలకు బదిలీ చేశారు. ఇదీలా ఉండగా గడిచిన కాలంలో ఎప్పుడు కూడా సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లను బదిలీ చేసిన దాఖలాలు లేవు. బాల్కొండ మండల కేంద్రంలో పోస్టుమార్టం కేంద్రం ఉండగా ఖచ్చితంగా సివిల్ అసిస్టెంట్ సర్జన్‌ల ఉపయోగం ఎంతైనా అవసరం ఉంది. ఒకే డాక్టర్ అన్ని పనులు చేయాలంటే ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొవాల్సి పరిస్థితి నెలకొంది. అలాగే మోర్తాడ్ పరిధిలో చుట్టు పక్కల మండలాలతో పాటు గ్రామాల పరిసర ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుంటారు. దీంతో భర్తీ అయిన సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టును జిల్లా కేంద్రంలోని యుపీహెచ్‌సీ సెంటర్‌కు బదిలీ చేశారు. దీంతో డివిజన్ పరిధిలో భర్తీ అయిన పోస్టులను మార్పులు చేయాల్సిన అవసరం ఎంత వరకు ఉందో అర్థం కావడంలేదు. పేదప్రజలకు అందుబాటులో ఉండాల్సిన డాక్టర్‌లను మార్పు చేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక వైపు 30పడకల ఆసుపత్రిలో సిబ్బంది లేక సతమత మవుతుంటే వచ్చిన డాక్టర్‌లను తమకు ఇష్టమైన చొటుకు మార్చడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల వచ్చిన డాక్టర్‌లు, సిబ్బంది మార్పులో అంతర్యమేమిటో అర్థం కావడం లేదు. అమ్యాలకు ఆశపడి ఇష్టమొచ్చిన చోట డాక్టర్‌లను, సిబ్బందిని మార్పులు చేసినట్టు ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఆర్మూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి క్యాడర్ స్ట్రెంత్ లేక సతమతమవుతుంటే 30 పడకల ఆసుపత్రికి ఉన్న క్యాడర్ స్ట్రెంత్‌లో వచ్చిన సిబ్బందిని సైతం ఓ వైద్యాధికారి జిల్లా కేంద్రంలో పావులు కదిపి వారికి ఇష్టమైన చోట సిబ్బందిని కేటాయించినట్లు తెలిసింది. అలాగే సబ్ డివిజన్ పరిధిలో తన వారికి ఇష్టమైన చొట పోస్టింగ్‌లు ఇప్పించినటు ప్రజలు భావిస్తున్నారు. ఉన్నతాధికారులు పరిస్థితులకు అనుగుణంగా పోస్టింగ్ లు ఇవ్వాలని ప్రజలు భావిస్తున్నారు. నిత్యం ఏరియా ఆసుపత్రిలో వందల కొద్ది రోగులు వస్తుండగా సిబ్బంది కొరతతో క్లీనింగ్ సెక్షన్‌కు సంబంధించిన వారు ప్రథమ చికిత్సలు చేస్తున్నారని, గత్యంతరం లేక రోగులు ఓపిక వహిస్తున్నారని, వచ్చిన డాక్టర్‌లను మరో చోట బదిలీ చేయడం ఏంటని ఉన్నతాధికారులను ప్రశ్నిస్తున్నారు. జిల్లా కలెక్టర్ పరిస్థితులను తెలుసుకొని డాక్టర్‌లను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్లు లేవు.. హెచ్చరిక బోర్డులు కరువు

● రాజంపేట,బస్వన్నపల్లి, ఆర్గొండ గ్రామం వద్ద భయంకరంగా మూలమలుపులు ● తరచూ ప్రమాదాలతో ఆందోళన



జర దేఖో!!



బస్వన్నపల్లి రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులు, ఆర్గొండ శివారులో స్పీడ్ బ్రేకర్స్ లేక ప్రమాదానికి గురైన దృశ్యం

రాజంపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్గొండ, బస్వన్నపల్లి తదితర గ్రామాల వద్ద రోడ్డు మలుపులో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక మలుపు దగ్గర కూడా ప్రమాదకర పరిస్థితులు నివారించే విధంగా స్పీడ్ బ్రేకర్లు,హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రోడ్డు మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చేవరకు కనిపించకపోవడంతో చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రెండు వరుసల రోడ్డు కావడం,వాహనచొదకులు అడ్డు అదుపు లేకుండా స్పీడ్ గా వెళ్తున్నారు. దీంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు ప్రమాదాల్లో ఎంతోమంది గాయపడి మరణించిన వారు ఉన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పీడ్ బ్రేకర్లు, మూలమలుపుల్ల వద్ద సూచిక బోర్డులు లేక రాత్రి సమయంలో ప్రమాదాలుచోటుచేసుకుంటున్నాయి. కామారెడ్డి నుంచి మెదక్ వెళ్లే ప్రధానరోడ్డు కావడంతో నిత్యం పెద్దసంఖ్యలో వాహనాలు వెళ్లడంతో సూచిక బోర్డు లేక పెద్ద మూలమలుపులు రెండు వరుసల రోడ్డు ఉండడంతో అధిక వేగంతో వెళ్లడంపై ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.అపరాధ రుసుము విధించి పోలీసులు చేతులు దులుపుకుంటున్నారే తప్ప కఠినచర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లను ప్రమాదకర సూచిక బోర్డులు,హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జాతీయ సీనియర్ బేస్‌బాల్

పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జాతీయ సీనియర్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

డిచ్‌పల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7 నుంచి 9 వరకు జగిత్యాల జిల్లాలో జరిగిన రాష్ట్ర బేస్ బాల్ పోటీలో జిల్లా మహిళా జట్టు తరఫున తృతీయ స్థానం పొంది కీలక పాత్ర పోషించిన క్రీడాకారులు సుమలత, నిషా సుద్దపల్లి గురుకుల పాఠశాల విద్యార్థినులు ఈ నెల 26 నుంచి 29 వరకు పంజాబ్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబర్చి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని వారు పేర్కొన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను తెలంగాణ బేస్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్వేత, ట్రెజరర్ చిన్ని కృష్ణ, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగా మోహన్‌లు, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్‌గౌడ్, జిల్లా స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ నీరజారెడ్డి, ప్రిన్సిపాల్ నళిని, అకాడమిక్ కోచ్ మౌనిక, వ్యాయామ ఉపాధ్యాయులు జ్యోత్స్న, శ్రీలత, అనికేత్, నరేష్‌లు అభినందించారు.

ఇందిరమ్మ సర్వేకు సర్వర్ కష్టాలు

● సర్వర్ స్లోగా రావడంతో ఇబ్బందులు ● డొంకేశ్వర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్లకు వచ్చిన దరఖాస్తులు 4500
● ఇప్పటి వరకు 60శాతం పూర్తి ● మరో ఐదు రోజులో ఐదు రోజుల్లో 40శాతం పూర్తయ్యేనా?

డొంకేశ్వర్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు అడ్డంకులు కలుగుతున్నాయి. సర్వేలో సిబ్బంది సేకరించిన దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేసేందుకు నెట్‌వర్క్ సర్వర్ సమస్య వేదిస్తుంది. మండలంలో 13 గ్రామపంచాయతీల్లో సర్వే చేపట్టనప్పటికీ సర్వస్ సమస్యతో ఆన్‌లైన్ ప్రక్రియ అధికారులు అనుకున్నస్థాయిలో ముందకు సాగడంలేదు. మరో కొద్ది రోజుల్లో సర్వేతో పాటు ఆన్‌లైన్ ప్రక్రియ కూడా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో సర్వే సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం 4500మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటికి గతంలో ఆన్‌లైన్ చేశారు. గ్రామకార్యదర్శులు ఆన్‌లైన్ ఆధారంగా దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు. మండలంలో ఆయా గ్రామాల వారీగా సిబ్బంది పనిలో నిమగ్నమయ్యారు. కానీ నెట్‌వర్క్ సర్వర్ సమస్యతో మండలంలో సర్వే వేగవంతంగా ముందుకు సాగడం లేదు. ఇప్పటివరకు 2400 దరఖాస్తులు ఆన్‌లైన్ చేశారు. మిగిలిన 2100 దరఖాస్తులను గడువు లోగా పూర్తి చేసేందుకు అధికారులు ముందుకు సాగుతున్నారు. సర్వేలో నెట్‌వర్క్ సమస్య ఇబ్బందులు ఉన్న 60 శాతానికి పైగా దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

వివరాల సేకరణ ఇలా..

సర్వే సిబ్బంది దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్తే పూరి గుడిసె, రేకుల ఇళ్ళు పెంకుటిళ్లు, తదితర నివాసం ఉంటున్న వివరాలు సేకరిస్తున్నారు. దరఖాస్తుదారులకుటుంబ సభ్యులతో కలిసి ఫోటో సేకరిస్తున్నారు. ఇంటి లోపలి భాగంపై భాగం వివరాల యాప్ లోడ్ చేస్తున్నారు. దరఖాస్తుదారుడి ఇంటి నిర్మాణం స్థలం ఉంటే ఫోటో సేకరిస్తారు. అందుకు సంబంధించిన పత్రాన్ని ఫోటో తీస్తారు. గతంలో ఏదైనా ప్రభుత్వ పథకం ద్వారా లబ్ధి పొంది ఉంటే వివరాలను ఆరాతీస్తున్నారు. కుటుంబంలో ఒంటరి మహిళ దివ్యాంగులు, వితంతు, మహిళలు ఉంటే సమాచారం సేకరిస్తున్నారు. సర్వర్ సమస్యతో సేకరించిన వివరాలు ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ కావ డానికి చలా సమయం తీసుకోవడంతో సర్వే చేస్తున్న అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. సెలవు దినాల్లో కూడా సెలవు తీసుకోకుండా అధికారులు వచ్చి సర్వే చేస్తున్నారు. గడువు దగ్గర పడడంతో మిగిలిన ఐదు రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఉద్దేశంతో సెలవు దినాల్లో కూడా అధికారులు సర్వే వివరాలను నమోదు చేస్తున్నారు. దరఖాస్తుదారుల ఇంటి వివరాలు నమోదు చేసేందుకు సర్వర్‌లో నెలకొన్న సమస్యతో పంచాయతీ కార్యదర్శులు ఆరంభంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సర్వర్ స్లోగా ఉండడంతో పాటు ఇంటర్‌నెట్ సరిగ్గా లేకపోవడంతో దరఖాస్తుదారుల ఇంటి వివరాలు నమోదు చేసి ఫోటోల అప్‌లోడ్ చేయడానికి ఆలస్యం అవుతుంది. ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలు ఫోటోలను నమోదు చేసేందుకు సుమారు 15 నుంచి 20నిమిషాల సమయం పడుతుందని సర్వే చేస్తున్న అధికారులు పేర్కొంటున్నారు.



డొంకేశ్వర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న దృశ్యం

ఏడో బెటాలియన్

పోలీసుల వెట్టిచాకిరీ ఇంకెన్నాళ్లు?

● నేడు ఐజీని కలువనున్న బెటాలియన్ పోలీసు కుటుంబాలు



ఆందోళన చేస్తున్న బెటాలియన్ మహిళలు (ఫైల్)

డిచ్‌పల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా ఏడో బెటాలియన్‌లో కానిస్టేబుల్ వృత్తిని నిర్వహిస్తూ పోలీసు అధికారుల ఇళ్ల వద్ద (ఆర్డర్ లీ వ్యవస్థ) ఎన్నాళ్లీ వెట్టిచాకిరీ పనులు చేయిస్తారని తమకు కూడా సివిల్ పోలీసుల వల్లే వారానికి ఒకమారు సెలవులు ఇవ్వాలని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేడు ఏడో పోలీస్ బెటాలియన్‌లో జరిగే కార్యక్రమానికి బెటాలియన్ ఐజీ చంద్రశేఖర్ ఐపీఎస్ హాజరవుతున్న సందర్భంగా పోలీస్ బెటాలియన్ కుటుంబ సభ్యులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల బెటాలియన్ కుటుంబ సభ్యులు తమ భర్తలకు నెలల తరబడి విధులు నిర్వహిస్తూ సెలవులు లేకుండా వెట్టి చాకిరి పనులు చేయిస్తున్నారని మహిళలు జాతీయ రహదారిపై ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీంతో సమస్య పరిష్కారానికి బెటాలియన్ కుటుంబ సభ్యులు నేడు ఐజీని కలిసి వినతి పత్రం అందించనున్నారు.



నేడు బెటాలియన్‌కు ఐజీ రాక

● శిక్షణా పోలీసుల పాసింగ్ ఔట్ పరేడ్
● హాజరుకానున్న జిల్లా సీపీ సింధూశర్మ





డిచ్‌పల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత మార్చి నెలలో ఏడో పోలీస్ బెటాలియన్‌లో ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం 9 నెలల పాటు జరిగి నేడు ముగియనుంది. పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమానికి బెటాలియన్ ఐజీ ఐపీఎస్ చంద్రశేఖర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రానున్నారు. ఇందుకు తగిన విధంగా బెటాలియన్ పోలీసు అధికారులు సర్దార్ వల్లభాయ్ స్టేడియాన్ని రంగురంగుల కవాతు జెండాలతో ముస్తాబు చేస్తున్నారు. 463 మంది శిక్షణ పూర్తి చేసుకున్న జవాన్లకు నేడు వివిధ ప్రాంతాలకు విధులు నిర్వహించేందుకు ఐజీ చంద్రశేఖర్ సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నారు. పోలీసుల శిక్షణ సమయంలో నేర్చుకున్న అత్యంత కఠోర విన్యాసాలను పోలీసులు ప్రద ర్శన చేసినవి కూడా ఆంధ్రజ్యోతి వారి అభిప్రాయాలను పంచు కుంది. శిక్షణలో తాము ఎన్నో విషయాలు నేర్చుకున్నా మని వారు తెలిపారు. ఇందులో భాగంగా కరాటే, ఇండోర్, ఔట్‌డోర్, ఏకె47, ఎస్‌ఎల్ఆర్ ఆయుధాల శిక్షణ కూడా పూర్తిగా నేర్చుకున్నట్లు వారు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. అంతేకాకుండా ఏడో బెటా లియన్‌లో 463 మంది శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో డిగ్రి విద్యాభ్యాసం చేసిన వారు 278 కాగా, పిజి 34, బీటెక్ 32, ఇంటర్ 111, బి ఫార్మసీ 2 ఉన్నారు. వీరందరికి బెటాలియన్ కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్, ఆర్ ఎస్సైలు 15 మంది వరకు శిక్షణ కార్యక్రమాలను నిర్వర్తించి జవాన్‌లుగా సిద్ధం చేశారు. నేడు బెటాలియన్‌కు ఐజీ రానున్న సందర్భంగా బెటాలియన్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ గ్రౌండ్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.





పోలీసుల కఠోర శిక్షణ దృశ్యాలు



పాసింగ్ ఔట్ పరేడ్ సందర్భంగా బెటాలియన్ పోలీసుల కవాతు

పేదలకు అందుబాటులోకి మెరుగైన వైద్య సేవలు

(ఐదో పేజీ తరువాయి)

నస్రుల్లాబాద్, చందూర్‌లకు మంజూరు చేయించామన్నారు. బాన్సువాడలో 100పడకల ఆసుపత్రి భవనం స్థానంలో నూతన భవన సముదాయం నిర్మాణానికి 37కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నామని దీనితో పాటు మరో వంద పడకలతో మాతాశిశు ఆసుపత్రిని మంజూరు చేయించామన్నారు. వర్ని మండల కేంద్రంలో రూ.13కోట్లతో చేపట్టిన 30 పడకల ఆసుపత్రి నూతన నిర్మాణం పనులు దాదాపుగా పూర్తయ్యాయని త్వరలోనే దీనిని ప్రారంభించడం జరుగుతుందన్నారు. కోటగిరిలోని 10పడకల ఆసుపత్రిని 50పడకల స్థాయికి పెంచడం జరిగిందన్నారు. నిజాంసాగర్ కాలువల ఆధునీకరణ కోసం రూ.900కోట్లు వెచ్చించామని, డిస్ట్రిబ్యూటరీలకు మరో రూ.200కోట్లు ఖర్చు చేశామని వివరించారు. నిజాంసాగర్ ద్వారా నీటి సౌలభ్యత లేని చందూర్, కారేగాం, లక్ష్మాపూర్ వంటి గ్రామాల రైతాంగానికి సాగునీటి వసతి కోసం నిజాంసాగర్ కెనాల్‌లో సుమారు 150కోట్ల రూపాయలతో లిఫ్ట్ నిర్మాణం జరిపిస్తున్నామని తెలిపారు. దీని ద్వారా సుమారు 10వేల ఎకరాలకు సాగునీరు సమకూరుతుందని అన్నారు. అదే విధంగా రూ.250కోట్లతో చేపట్టిన సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు వేగంగా జరుగుతున్నాయని, ఈ రిజర్వాయర్ ద్వారా మరో 14వేల ఎకరాలకు సాగునీటి సౌలభ్యం సమకూరుతుందని పోచారం తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణంలో సుమారు 600ఎకరాల అటవీ భూమి ముంపునకు గురవుతుండగా ఈ మేరకు ఇతర ప్రాంతాలలో ప్రభుత్వ భూమిని అటవీశాఖకు సమకూర్చేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపారని ఈ సందర్భంగా పోచారం స్థానికుల తరఫున కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా బాన్సువాడ నియోజకవర్గానికి రూ.5వేల కోట్లతో 11వేల ఇళ్లను మంజూరు చేశామని అన్నారు. ఇది వరకు గృహలక్ష్మి పథకం కింద మంజూరీలు తెలిపిన వారిలో సొంత స్థలాలు కలిగి ఉన్న అర్హులైన వారిని ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్దిదారులుగా ఎంపిక చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎంతో విలువైన స్థలాన్ని దానం చేయడం గొప్ప విషయమని దాతలను అభినందించారు. వారి కోరిక మేరకు పీహెచ్‌సీకి స్వర్గీయ సుబ్బారావు పేరిట నామకరణం చేసేందుకు అధికారికంగా ప్రొసిడింగ్స్ జారీ చేస్తామని అన్నారు. జిల్లాకు కొత్తగా 8అంబులెన్సులు కేటాయించగా వాటిలో 3అంబులెన్సులు బాన్సువాడ నియోజకవర్గానికి మంజూరు అయ్యాయని అన్నారు. కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ, పంచాయతీ రాజ్ ఈఈ శంకర్, ఎంపీడీవో నీలావతి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్, మాజీ ఎంపీపీ లావణ్య, మాజీ జడ్పీటీసీ అంబర్ సింగ్, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్ల పంపిణీ



కృత్రిమ కాలును అమర్చుతున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో నగరంలోని భక్తత్‌పురాలో గురువారం కృత్రిమ కాళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జైపూర్ కృత్రిమ కాళ్ల పంపిణీని చేపట్టారు. కాళ్లు లేని వారికి ఈ కృత్రిమ కాళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో 32 మందికి జైపూర్ కాళ్ల పంపిణీ చేయడంతో పాటు ఆరుగురికి కాళ్ల రిప్లేస్‌మెంట్ చేశారు. రోటరీక్లబ్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు బీరెల్లి విజయ్‌రావు, మాజీ అధ్యక్షుడు ఇంగు రాజేశ్వర్‌లు తెలిపారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సభ్యులు కూడా సహకారం అందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింబ్ సెంటర్ చైర్మన్ శ్రీరాంసోని, క్లబ్ కార్యదర్శి గంగారెడ్డి, ట్రస్ట్ చైర్మన్ ప్రకాశ్ మిట్టల్, కార్యదర్శి జితేంద్రమాలానీ, కోశాధికారి జ్ఞానప్రకాశ్, రాజ్‌కుమార్ సుబేదార్, బాబురావు, శ్యామ్ అగర్వాల్, పవన్‌పాండే, జుగల్‌సోని, నర్సింగ్ యాదవ్, మిట్టల్, కవిత అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

సుభాష్‌నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ నగరంలో పార్టీ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీని నిర్వహించారు. నగరంలోని శ్రద్ధానంద్ గంజ్ నుంచి ర్యాలీగా అంబేద్కర్ కాలనీ, రైస్‌మిల్ హమాలీ యూనియన్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సందర్భంగా సీపీఐ జెండాను జిల్లా కార్యదర్శి సుధాకర్ ఆవిష్కరించారు. సీపీఐ 1925 డిసెంబర్ 26న ఖాన్‌పూర్‌లో ఆవిర్భవించిందని జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేశారని అన్నారు. నైజాం పాలనపై తిరుగులేని పోరాటాన్ని నిర్వహించింది సీపీఐ అని ఆయన అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా తెలంగాణ బిల్లు పెట్టాలని పోరాడిన పార్టీ సీపీఐ అని ఆయన అన్నారు. ప్రజల కోసం వందేళ్లుగా రాజీలేని పోరాటాన్ని చేస్తున్నామన్నారు. సమస్యలను పరిష్కరించే విధంగా చూడటంతో పాటు పేదలపై భారం పడకుండా ఉండేందుకు పార్టీ కృషి చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలపై భారాన్ని పెంచుతూ వాటిని కోలుకోలేని దెబ్బతీస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో ఏఐటీయుసి నాయకులు ఓమయ్య పార్టీ నేతలు రఘురాం, అంజలి, రంజిత్, ఇమ్రాన్‌అలీ, సఖి, సురేష్, భాను, పరుశురాం, షైమద్, సంపత్, సాయిలు, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మూకుమ్మడి ఆత్మహత్యల కలకలం

(ఐదో పేజీ తరువాయి)

చోటుచేసు కోకుండా కామారెడ్డి ఆసుపత్రిలో పోలీసు బందోబస్తు మధ్య మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించి అంబులెన్స్‌లో స్వగ్రామాలకు తరలించారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఎస్సై సాయికుమార్ సిద్దిపేట జిల్లా చిన్నకొడురు మండలం, కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం, బీబీపేట పోలీసుస్టేషన్‌లో ఎస్సైగా పనిచేశారు. భిక్కనూరు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. మృతుడు సాయికుమార్‌కు భార్య లక్ష్మీ, కొడుకు శ్రీహన్ష్ ఉన్నారు. 2014 బ్యాచ్‌కు చెందిన శృతిది గాంధారి. ఈమెకు గతంలో ఓ వ్యక్తితో వివాహం జరగగా విడాకులయ్యాయి. మూడేళ్లుగా బీబీపేట పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోంది. మరో మృతుడు నిఖిల్ కాంట్రాక్టు పద్ధతిలో స్థానిక సొసైటీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆరేళ్ల కిందట తండ్రి లింగం ఆత్మహత్యచేసుకున్నాడు. తల్లి స్వరూప, సోదరుడు ఉన్నారు.

అసలేం జరిగిందంటే..?

భిక్కనూరు ఎస్సై సాయికుమార్ బుధవారం మధ్యాహ్నం వరకు విధుల్లో ఉండి ఆ తర్వాత సొంతకారులో బయటకు వెళ్లినట్లు స్టేషన్ పోలీసులు చెబుతున్నారు. మహిళా కానిస్టేబుల్ శృతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ ఇద్దరూ కలిసి బీబీపేటనుంచి బస్సులో ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. వీరిఇద్దరిని ఎస్సై కామారెడ్డి బస్టాండ్ నుంచి కారులో తీసుకెళ్లి ఎవరూ లేని ప్రాంతమైన 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న అడ్లూర్‌ఎల్లారెడ్డి పెద్దచెరువు వైపు వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే ముగ్గురి మధ్య కారులోనే వాగ్వాదం చోటుచేసుకోగా క్షణికావేశంలో శృతి కారులోంచి దిగి చెరువులోకి దూకేందుకు ప్రయత్నించగా నిఖిల్, ఎస్సై సాయికుమార్‌లు వెంటనే ఆమెను ఆపే ప్రయత్నం చేశారని అక్కడున్న ఆనవాళ్లు బట్టి పోలీసులు అనుమానిస్తున్నారు. శృతిని కాపాడేందుకు నిఖిల్, ఎస్సై సాయికుమార్‌లు సైతం చెరువులో దూకారు. చెరువులో దూకగానే పిచ్చిమొక్కలు, నాచుతీగల మధ్య చిక్కిపోయి మునిగి పోవడంతో ఊపిరాడక ముగ్గురూ చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా బీబీపేట పోలీసుస్టేషన్‌లో సాయికుమార్ ఎస్సైగా పనిచేసినప్పుడు కానిస్టేబుల్ శృతి పరిచయం కావడం, వీరి మధ్య వివాహేతర సంబంధం సాగిందని స్థానికంగా ప్రచారం సాగుతోంది. అయితే సాయికుమార్ భిక్కనూరు పోలీసు స్టేషన్‌కు బదిలీ అయిన తర్వాత వీరు ఇరువురి మధ్యగ్యాప్ పెరిగింది. ఇదేక్రమంలో శృతికి నిఖిల్‌తో పరిచయం ఏర్పడడం అదికాస్త సన్నిహిత్యంగా మారింది. వీరు ఇరువురూ పెళ్లిచేసుకుందామని నిర్ణయించుకున్నట్లు బీబీపేటలో ప్రచారం అవుతోంది. అయితే శృతి మృతదేహం, ముఖంపై గాయాలు ఉన్నాయని, ఎస్సై సాయికుమార్, నిఖిల్ దాడి చేసి హత్య చేసి ఉంటారని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు.

కీలకం కానున్న పోస్టుమార్టం రిపోర్టు, ఫోన్‌కాల్స్ డాటా

అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్దచెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఎస్సై, మహిళా కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్‌ల ఫోన్ కాల్స్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టనున్నారు. ఘటనా స్థలం వద్ద మొదట మహిళా కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్ ఫోన్‌లు పోలీసులకు లభ్యమయ్యాయి. అయితే ఎస్సై సాయికుమార్ ఫోన్ దొరకకపోవడంతో ఎస్సై చెరువులో దూకి ఉండవచ్చా లేదా ఎక్కడికైనా పారిపోయి ఉండవచ్చా అని పోలీసులు అనుమానాలు వ్యక్తం కాగా, చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా గురువారం ఉదయం ఎస్సై మృతదేహం లభ్యమైంది. మృతుడి జేబులోనే రెండు సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ముగ్గురు చనిపోవడంతో ఎవరిని విచారించాలనేదానిపై పోలీసులకు సైతం ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో మృతుల పోస్టుమార్టం రిపోర్టు, ఫోన్‌కాల్స్ డాటా, కుటుంబీకులు ఇచ్చే వివరాలు కీలకం కానున్నాయి. వివాహేతరసంబంధం కోణంలోనూ విచారణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. సదాశివనగర్ పోలీసుస్టేషన్‌లో మూకుమ్మడి ఆత్మహత్యలపై మృతుల కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సదాశివనగర్ సీఐ సంతోష్, ఎస్సై రంజిత్‌తోపాటు మరికొందరు పోలీసు అధికారులతో ప్రత్యేక టీంను ఏర్పాటుచేసి విచారణకై ఎస్పీ ఆదేశించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ సలహా దారుడు షబ్బీర్‌అలీ గురువారం జీజీహెచ్ ఆసుపత్రిలో ఎస్సై సాయికుమార్, మహిళా కానిస్టేబుల్ శృతి, యువకుడు నిఖిల్‌ల మృతదేహాలను పరిశీలించారు. ముగ్గిరి మృతి బాధాకరమని, మృతుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ప్రభుత్వ సలహా దారుడు షబ్బీర్ అలీ అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ

విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తాం : కామారెడ్డి ఎస్పీ

భిక్కనూరు ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, కంప్యూటర్ ఆపరేటర్ ముగ్గురి ఆత్మహత్యల ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాతే వివరాలు వెల్లడిస్తాం. బుధవారం సాయంత్రం నుంచి ముగ్గురు కనిపించకుండా పోయారు. ఫోన్ ట్రేసింగ్ ద్వారా వారి జాడను గుర్తించాం. అర్ధరాత్రి శృతి, నిఖిల్ మృతదేహాలు లభ్యమవగా ఉదయం ఎస్సై మృతదేహం లభించింది. వీరి ఆత్మహత్యకు గల కారణాలు ఇప్పుడే చెప్పలేం. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా వివరాలు వెల్లడిస్తాం.

జోరుగా ఇసుక దందా!

(ఐదో పేజీ తరువాయి)

ద్వారా తరలిస్తున్నారు. అవసరమైన వారికి రాత్రివేళల్లోనే సరఫరా చేస్తున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని పలు ప్రాంతాల్లో ఇసుకను డంప్‌లలో నిలువ చేస్తున్నారు. అక్కడి నుంచి తరలిస్తున్నారు. ఈ ఇసుక అక్రమ తవ్వకాలు మంజీరాతో పాటు పెద్దవాగు, కప్పలవాగు, ఫూలాంగ్ వాగుతో పాటు ఇతర వాగుల్లో కొనసాగుతుంది. డిచ్‌పల్లి, మోపాల్, నవీపేట్, మాక్లూర్, ఆర్మూర్, భీంగల్, వేల్పూర్, జక్రాన్‌పల్లి, ధర్పల్లి, ఇందల్వాయి, సిరికొండ, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల పరిధిలోని వాగుల్లో తవ్వకాలను చేస్తున్నారు. ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

చర్యలు చేపడుతున్నా ఉపయోగం లేదు

ఈ ఇసుక అక్రమ రవాణాను కిందిస్థాయిలో అరికట్టేందుకు కొన్నిచోట్ల అధికారులు చర్యలు చేపడుతున్నా ఉపయోగం లేకుండా పోతుంది. పైస్థాయి అధికారులు సహకరించకపోవడం వల్ల వారిపైనే అక్రమ తవ్వకం దారులు దాడులకు పాల్పడుతున్నారు. కొన్ని చోట్ల బెదిరింపులకు గురిచేస్తున్నారు. పెద్ద ఎత్తున రవాణా కొనసాగిస్తున్నారు. కిందిస్థాయిలో పనిచేసే ఆర్ఐ, డిప్యూటీ తహశీల్దార్, తహశీల్దార్, మైనింగ్, ఇరిగేషన్ అధికారులపైన బెదిరింపులకు దిగుతున్నారు. వీరికి అధికార పెద్దల అండదండలు ఉండటంతో యదేచ్ఛగా తవ్వకాలను చేస్తున్నారు. ఎవరైనా అధికారులు వాహనాలను నిలిపివేస్తే ప్రజా ప్రతినిధులు ఫోన్‌లు చేయడం, ఒత్తిళ్లు పెంచడంతో వదిలి వేస్తున్నారు. పోతంగల్, సాలూరా, భీంగల్, వేల్పూర్ మండలాల పరిధిలో ఈ బెదిరింపులు ఎక్కువగా కొనసాగుతున్నాయి. ప్రజాప్రతినిధులు సహ కరించడం గత ప్రభుత్వంలో కీలక పదవుల్లో మండల స్థాయిలో ఉన్న నేతలు తిరిగి అధికార పార్టీలో చేరడం వల్ల అధికారులు కూడా ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఇసుక రీచ్‌లకు అనుమతులు లేకున్నా ఈ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వానికి రావాల్సిన రాయాల్టీ రాకుండానే విలువైన ఇసుక తరలిపోతుంది. ప్రభుత్వంతో పాటు జిల్లా అధికారులు ఈ ఇసుక తవ్వకాలపై దృష్టిపెట్టి అవసరానికి అనుగుణంగా రీచ్‌ల నుంచి అనుమతులు ఇస్తే ఆదాయం రావడంతో పాటు అక్రమ తవ్వకాలు ఆగే అవకాశం ఉంది. జిల్లాలో మంజీరా, వాగుల్లో ఇసుక రీచ్‌లకు ఎక్కడా అనుమతులు ఇవ్వలేదని మైనింగ్ శాఖ అధికారులు తెలిపారు. ఆయా మండలాల స్థాయిలో తహసీల్దార్లే అనుమతులు అవసరాల మేరకు మంజూరు చేస్తున్నారని వారు తెలిపారు. తమకు సమాచారం వచ్చిన చోట తనిఖీలు చేయడంతో పాటు అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు.

ఆనందోత్సవాలతో బాక్సింగ్ డే

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా క్రిస్టియన్లు గురువారం బాక్సింగ్ డేను ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. క్రిస్మస్ పండుగ రోజులలో ఒకటైన బాక్సింగ్ డే రోజున క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ తోటి బంధువులు, స్నేహితులతో కలిసి బాక్సింగ్ డేను నిర్వహించుకున్నారు. పండుగను పురస్కరించుకొని చర్చీలలో ప్రార్థనలు నిర్వహించి భక్తిగీతాలు ఆలపించారు. చర్చీలలో అతిథులకు విందు భోజనాలతో ఆతిథ్యం ఇచ్చారు. బాక్సింగ్ డే పురస్కరించుకొని చర్చీలలో సాంస్కృతిక ప్రదర్శనలతో సంబరాలు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని సిఎస్ఐ చర్చిలో నిర్వహించిన పండుగ సంబరాల్లో చర్చి ఫాదర్‌లు బైబిల్ గ్రంథంలోని యేసు ప్రభువు చూపిన మార్గంపై సందేశం ఇచ్చారు. క్రిస్మస్ పర్వదినాలలో బాక్సింగ్‌డేతో పాటు న్యూ ఇయర్ వరకు ప్రత్యేక ప్రార్థనలు కొనసాగుతాయని తెలిపారు. అదే విధంగా నగరంలోని నిర్మల హృదయ, ఎస్ఎఫ్ఎస్, గ్లోరియస్, సియోన్, ఎల్లమ్మ గుట్ట చర్చిలలో ఘనంగా బాక్సింగ్ డే సంబరాలు జరుపుకున్నారు.



రోడ్లు ఊడ్చి సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు గురువారం 20వ రోజు రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు. సమ్మెలో భాగంగా వినూత్నంగా నగరంలోని రోడ్లను ఊడ్చి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. 20 రోజులుగా సమ్మె చేస్తున్నా తమను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని ఇప్పటికైనా ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. సమ్మెకు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, బీఎస్పీ కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ఈశ్వర్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు సుమన్, గైని గంగారాం తదితరులు సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన ఛానల్‌లో చేసిన వ్యాఖ్యలను సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, భూపేందర్‌లు ఖండించారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెను పీఆర్‌టీయూ అనే ఒకే సంఘానికి ఆపాదించడం బాధాకరమని దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాలలో స్వతంత్ర్యంగా కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మెను రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు అన్ని వర్గాలు సంఘీభావం, మద్దతు తెలియజేస్తున్నాయని కానీ తీన్మార్ మల్లన్న మా సమ్మె వెనుక ఎవరో ఉన్నారని అనడం సరికాదని అన్నారు.



రోడ్లు ఊడుస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి

● డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్

ధర్పల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోగల బంజారా భవనంలో మండల బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, లాల్ సింగ్, మంగ్సానాయక్, రాజునాయక్, దత్తునాయక్, చుక్కారాం, విఠల్‌రాథోడ్, రత్నం, రెడ్డి, బాల్యానాయక్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా యునైటెడ్ కిసాన్‌కు సభ ఏర్పాటు

సుభాష్‌నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ప్రోగ్రెసీవ్ కిసాన్ సభ అస్సాం బైటియోక్ సంత, త్రిపుర కృషక్ ముక్తీ సంగ్రామ్ పరిషత్, ఆల్ ఇండియా క్రాంతికారే కిసాన్ సభ సంఘాలు కలిసి ఆల్ ఇండియా యునైటెడ్ కిసాన్ సభగా ఏర్పడ్డాయని ప్రభాకర్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పశ్చిమబెంగాళ్‌లో ఈ నెల 19, 20వ తేదీలలో జరిగిన సమావేశాల్లో ఈ సంస్థ ఏర్పడిందన్నారు. రైతుల సమస్యలపై ఈ సంస్థ కలిసి పోరాటాలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో వచ్చేనెల 9న సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలను మొదలు పెడతామని తెలిపారు.

మద్యం మత్తులో ఒకరి మృతి

ఖిల్లా, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బొమ్మందేవపల్లి గ్రామం నస్రుల్లాబాద్ మండలానికి చెందిన మాగిడి కృష్ణ అధిక మద్యం తాగి మృతి చెందినట్లు సీఐ హరిబాబు తెలిపారు. సీఐ, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మాగిడి కృష్ణ ఈనెల 24న బోరు రిపేర్ చేస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరి ఇంటికి తిరిగిరాలేదని 26న గురువారం నగరంలోని లలితామహల్ థియేటర్ పక్కన అధిక మద్యం తాగి చనిపోయి పడిఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నేడు సమీక్ష సమావేశం

డిచ్‌పల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు చేసిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ సమావేశం డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద నేడు జరుగనుందని ఏపీవో మంజుల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్, అధికారులు హాజరుకానున్నారని ఉపాధి హామీ సిబ్బంది చేసిన పనుల వివరాలు వివరించాలని ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆమె తెలిపారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అగ్గు భోజన్న

ఆలయ భూమిని కబ్జా నుంచి కాపాడాలి

● కబ్జా దారులపై చర్యలు తీసుకోవాలి

● ఆలయ కమిటీ ప్రతినిధుల డిమాండ్

మోపాల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలంలోని కాలూర్, కొండూరు గ్రామాల శివారులోని నల్లపోచమ్మ ఆలయానికి చెందిన 38 గుంటల భూమిని అధికార పార్టీ నాయకులైన రాఘవేందర్, గడీల రాములు కబ్జా చేశారని నాయకులు అగ్గు భోజన్న ఆరోపించారు. గురువారం కాలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నల్లపోచమ్మ ఆలయ భూమిని కబ్జా చేశారని గత రెండు రోజుల క్రితం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కాలూరు గ్రామ శివారులో ఉన్న సర్వే నెంబర్ 109లో 12 ఎకరాల 11 గుంటల వ్యవసాయ భూమి ఉందని తెలిపారు. ఇందులో నుంచి 38గుంటల భూమిని ఆకుల రాఘవేందర్, గడీల రాములు ఇద్దరు కలిసి కబ్జా చేశారని ఇందులో నుంచి ఒక్కోక్కరు 19 గుంటల భూమిని వారి పేర్లపై నమోదు చేసుకున్నారని ఆరోపించారు. ఈ భూమి విలువ సుమారు 70లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఆలయానికి సంబంధించిన భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కాలూరు, కొండూరు గ్రామాల ప్రజలు దేనికైనా పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రెండు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.160	రూ.275	రూ. 295
వెన్‌కాబ్ (కిలో)	రూ.165	రూ.280	రూ. 300

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్ (10 గ్రా.)	వెండి (10 గ్రా.)
రూ.79000	రూ.72900	రూ.930

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : పుష్ప-2 (11.10, 3.15)
: మ్యాక్స్ (7.20)
: ముఫాసా (ఇంగ్లీష్ 3డి) (10.15)
స్ర్కీన్-2 : ముఫాసా (తెలుగు 3డి) (10.30, 1.20, 7.30)
:బారోజ్ (తెలుగు 3డి) (4.10) :పుష్ప-2 (10.20)
స్ర్కీన్-3 : బేబిజాన్ (హిందీ) (11.00, 10.40)
: పుష్ప-2 (హిందీ) (2.30)
: పుష్ప-2 (తెలుగు) (6.35)
స్ర్కీన్-4 : మ్యాక్స్ (10.30, 10.50)
: డ్రింకర్ సాయి (1.25)
: శ్రీకాకుళం షేర్‌లాక్‌హోమ్స్ (4.35)
: బేబిజాన్ (హిందీ) (7.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : మ్యాక్స్ (10.40, 1.30)
: శ్రీకాకుళం షేర్‌లాక్‌హోమ్స్ (4.30)
: పుష్ప-2 (7.00)
: బేబిజాన్ (హిందీ) (10.40)
స్ర్కీన్-2 : బేబిజాన్ (హిందీ) (1.00)
: పుష్ప-2 (4.00)
: యుఐ (7.40)
: మ్యాక్స్ (10.20)
స్ర్కీన్-3 : ముఫాసా (తెలుగు 3డి) (11.00, 5.00, 7.30)
: పుష్ప-2 (1.20, 10.00)

దేవి : ముఫాసా (11.00, 2.00, 6.00, 9.00)
నటరాజ్ : మ్యాక్స్ (11.00, 2.00, 6.00, 9.00)
విజయ్ : పుష్ప-2 (10.00, 2.00, 6.00, 10.00)
లలితామహల్:
యుఐ (11.15, 2.15)
: విడుదల-2 (6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్